తెలంగాణ ప్రభుత్వం
పౌరసరఫరాల శాఖ కార్యాలయం
సోమాజిగూడ, హైదరాబాద్ 500082

పత్రిక ప్రకటన : తేదీ : 20-12-2018

# తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం
# రైతులు ఆందోళన చెందొద్దు

పెథాయ్ తుపాను వల్ల కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ పూర్తిగా కొనుగోలు చేస్తుంది. ఈ విషయంలో రైతులు ఆందోళన చెందొద్దు.

రాష్ట్రవ్యాప్తంగా 3,491 టన్నుల ధాన్యం తడిసిందని పౌరసరఫరాల శాఖ అంచనా వేసింది. తడిసిన ప్రతి ధాన్యపు గింజను కొనడానికి చర్యలు చేపట్టింది.

పౌరసరఫరాల శాఖ ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 3214 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, 6.15 లక్షల మంది రైతుల నుండి 32 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. దీని విలువ రూ.5672 కోట్లు ఉంటుంది. ఇందులో రూ. 4922 కోట్లు ఆన్‌లైన్ ద్వారా రైతు ఖాతాలో జమచేయడం జరిగింది. మిగిలిన చెల్లింపులు వివిధ దశలో ఉన్నాయి. రైతులకు కనీస మద్దతు ధర చెల్లింపులకు సంబంధించి ఎలాంటి నిధుల కొరత లేదని ఆ శాఖ కమిషనర్ శ్రీ అకున్ సబర్వాల్ స్పష్టం చేశారు.

గడిచిన నాలుగైదు రోజులుగా ఆయా జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ వర్షాల ప్రభావం రైతాంగం మీద ఎక్కువ మొత్తంగా పడకుండా తగిన జాగ్రత్తలు, చర్యలు తీసుకుంది.

పెథాయ్ తూపాన్ వల్ల పౌరసరఫరాల శాఖ పౌరసరఫరాల భవన్‌లో కంట్రోల్ రూంను ఏర్పాటు చేసింది. కంట్రోల్‌రూంకు వచ్చిన నివేదిక ప్రకారం 3214 కొనుగోలు కేంద్రాల్లో 1117 కేంద్రాల్లో 3,491 టన్నుల ధాన్యం తడిచింది. ఇందులో ముఖ్యంగా మంచిర్యాల, సిద్దిపేట, ఆదిలాబాద్, సిరిసిల్ల జిల్లాల్లో ధాన్యం ఎక్కువగా తడిచింది.

ఆయా జిల్లాల్లో కొనుగోలు చేసిన మొత్తం ధాన్యంలో 10 శాతం ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ రైస్ (బాయిల్డ్ రైస్‌ను) కింద రైస్ మిల్లర్లు ఎఫ్‌సిఐకి అప్పగించడానికి గురువారం నాడు పౌరసరఫరాల శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

“అకాల వర్షాల నేపథ్యంలో నష్టం ఎక్కువగా ఉండకుండా మార్కెటింగ్, పౌరసరఫరాలు, రవాణా, రూరల్ డెవలప్‌మెంట్ (ఐకేపీ) విభాగాల అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో సమన్వయంతో పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. ధాన్యం తడవకుండా ప్రతి కొనుగోలు కేంద్రంలో అవసరమైన గోనె సంచులను, టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచడం జరిగింది. అలాగే కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించడం జరుగుతోంది. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 32 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 31.82 లక్షల టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించడం జరిగింది” అని పౌరసరఫరాల శాఖ కమిషనర్ శ్రీ అకున్ సబర్వాల్ తెలిపారు.

---

పౌరసరఫరాల శాఖ కార్యాలయం నుంచి జారీచేయబడినది.